www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 12 | డిసెంబర్ | 2025 పేజీలు : 6

## పంచాయతీ పోలింగ్‌కు భద్రత కట్టుదిట్టం



3 లో

# మొదటి విడతలో అధికార పార్టీ హవా




-రఘునాథపాలెంలో గట్టి పోటీ ఇచ్చిన బిఆర్ఎస్

-వామపక్షాలకు సానుకూల ఫలితాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మొదటి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో అధికార పార్టీ హవా కొన సాగింది. ఎన్నికలు జరిగిన ఏడు మండలాల్లోనూ కాంగ్రెస్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. తొలి విడత ఎన్నికలు జరిగిన రఘునాథపాలెం, కొణిజర్ల , వైరా, చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను సాధించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మిశ్రమ ఫలితాలు వెలువడుతున్నాయి. రఘునాథపాలెం మండలంలో మొత్తం 37 పంచాయతీలు ఉండగా ఐదు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా 32 పంచాయతీలకు ఎన్నికలు జరగగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు హోరాహోరీగా పోరాడాయి. 11 స్థానాల్లో బిఆర్ఎస్,

మిగతా 2లో..

## ఉమ్మడి జిల్లాలో సిపిఐ అభ్యర్థుల విజయ ఢంకా



**ప్రజాపక్షం/ ఖమ్మం :**
తొలి దశ ఎన్నికల్లో పలు చోట్ల సిపిఐ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. చింతకాని మండలం నేరడ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పక్షాన పోటీ చేసిన దూసరి నేతాజీ రికార్డు మెజార్టీతో విజయం సాధించారు. 425 ఓట్ల మెజార్టీతో నేరడ సర్పంచ్‌గా గెలుపొందారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన నాగిలిగొండ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థి ఏపూరి పద్మ విజయం సాధించారు. చిం తకాని మండలం బస్వాపురం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆవుల నర్సింహారావు భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఖమ్మం జిల్లాలో వి. వెంకటాయపాలెం పంచాయతీలో సిపిఐ విజయం దిశగా సాగుతుంది. కొణిజర్ల మండలం పెద్దమునగాలలో సైతం సిపిఐ ఒంటరిగా బరిలో నిలిచి మెజార్టీ వార్డులను గెలుచుకోగా సర్పంచ్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దుమ్ముగూడెం మండలంలో ఐదు స్థానాల్లో పోటీ చేసి ఐదింటిలో విజయం సాధించడం జరిగింది. తూరుబాక సర్పంచ్‌గా అజ్మీర శైలజ, నర్సాపురం సర్పంచ్‌గా కుంజ కనకరత్నం, పెద్దర్లగూడెం సర్పంచ్‌గా పాయం వెంకటేశ్వర్లు, పాతబండారు గూడెం సర్పంచ్‌గా కుంజ ప్రమీల, నడికుడి సర్పంచ్‌గా జగిడి పాలమ్మ, చర్ల మండలం తిప్పాపురం సర్పంచ్‌గా నూపా సునీత, కర్నెపల్లి సర్పంచ్‌గా శ్యామల తిరుపతిరావు విజయం సాధించారు. మణుగూరు మండలం సాంబాయి గూడెంలో సిపిఐ బలపర్చిన చీడం ఉషారాణి గెలుపొందారు.

## ప్రజాక్షేత్రంలో ఉండే వారినే
# గెలిపించండి




- గత ఎన్నికల ఫలితాలు పునరావృతం కావాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

- అవకాశం కల్పించండి

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఓట్ల సమయంలో వచ్చిపోయే వారిని కాకుండా నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా క్షేత్రం ఉండి పోరాడే వారినే గెలిపించాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మండల పరిధి చంద్రాలగూడెం, రేగులగూడెం, బంజెర, లక్ష్మీదేవిపల్లి, ఉల్వనూర్, మందెరికలపాడు, సత్యనారాయణపురం (మొండికట్ట) రెడ్డిగూడెం (ప్రభాత్‌నగర్) యానంబైల్, కిన్నెరసాని, కోడిపుంజుల వాగు తదితర గ్రామాలలో

మిగతా 2లో..

# మొదటి విడతలో అధికార పార్టీ హవా

(మొదటిపేజీ తరువాయి)

19 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందింది. సిపిఐ రెండు స్థానాల్లో విజయం సాధించింది. మరికొన్ని ఫలితాలు రావాల్సి ఉంది. లెక్కింపులో తీవ్ర జాప్యం కారణంగా చిన్న చిన్న పంచాయతీల్లో ఓట్ల లెక్కింపు ఆలస్యమవుతుంది. మధిర మండలంలో బిఆర్ఎస్ కొన్ని స్థానాల్లో విజయం సాధించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ భారీగానే గ్రామ పంచాయతీల్లో పాగా వేసింది. ఎర్రుపాలెం మండలంలో కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది.లెక్కింపు జరిగిన గ్రామ పంచాయతీల్లో అత్యదిక స్థానాలను గెలుచుకున్నది. కాంగ్రెస్ పార్టీ 17 చోట్ల విజయం సాధించగా కాంగ్రెస్ రెబల్స్ మూడు చోట్ల, బిఆర్ఎస్ ఐదు పంచాయతీల్లో విజయం సాధించాయి. మరికొన్ని పంచాయతీల వివరాలు అందాల్సి ఉంది. చింతకాని మండలంలో వామపక్షాలు తమ పట్టును నిలబెట్టుకున్నాయి. సిపిఐ, నేరడ, నాగిలిగొండ, బస్వాపురం గ్రామాల్లో గెలుపొందగా సిపిఎం పందిళ్లపల్లి, కోదుమూరు, పాతర్లపాడు, స్టేషన్ నాగులవంచలో విజయం సాధించింది. బోనకల్ మండలంలో గతంలో పంచాయతీ ఎన్నికల్లో అంతగా ప్రభావం చూపలేని కాంగ్రెస్ ఈ దఫా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇప్పటికే 10 పంచాయతీల్లో విజయం సాధించింది. సిపిఎం సైతం గోవిందాపురం (ఎల్), పెద్దబీరవల్లి, గార్లపాడు, మోటమర్రి స్థానాల్లో విజయం సాధించింది. కొణిజర్ల మండలంలో సైతం కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను గెలుచుకుంది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ స్థానాల్లో గెలిచినప్పటికీ కొన్ని చోట్ల బిఆర్ఎస్ గెలుపొందింది. సిపిఐ పోటీ చేసిన నాలుగు స్థానాల్లో రెండు చోట్ల విజయం దిశగా దూసుకుపోతుంది. వైరా మండలంలో కెజి సిరిపురం మినహా మిగిలిన చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు విజయం దిశగా పయనిస్తున్నారు. మధిర మండలంలో కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ గట్టి పోటీనివ్వగా ఇక్కడ టిడిపి అల్లినగరం గ్రామ పంచాయతీని గెలుచుకుని బోణీ కొట్టింది. తొలి విడత ఎన్నికలు జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో సిపిఐ సత్తాను చాటింది. దుమ్ముగూడెం మండలంలో ఐదు స్థానాల్లో పోటీ చేయగా ఐదు స్థానాలను సిపిఐ కైవసం చేసుకుంది. చర్ల మండలం కర్నెపల్లి సర్పంచ్‌గా శ్యామల తిరుపతిరావు విజయం సాధించగా దుమ్ముగూడెం మండలం తూరుబాకలో సిపిఐ అభ్యర్థి అజ్మీర శైలజ, నర్సాపురంలో కుంజా కనకరత్నం, పెద్దర్లగూడెంలో పాయం వెంకటేశ్వర్లు, పాతబండారుగూడెంలో కుంజా ప్రమీల, నడికుడిలో జగిడి పాలమ్మ సిపిఐ పక్షాన విజయం సాధించారు. మణుగూరు మండలం సాంబాయిగూడెంలో సిపిఐ అభ్యర్థి ఉషారాణి విజయం సాధించారు. మణుగూరు మండలంలో కడపటి సమాచారం వరకు సిపిఐ ఒకటి, సిపిఎం ఒకటి, కాంగ్రెస్ ఆరు, బిఆర్ఎస్ ఒక స్థానంలో గెలుపొందాయి. బూర్గంపాడు మండలంలో కాంగ్రెస్ హవా కొనసాగింది. పినపాకలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల మధ్య హోరాహోరీ పోరు నడిచింది. కరకగూడెం మండలంలో మొత్తం 16 పంచాయతీలు ఉండగా తొమ్మిది కాంగ్రెస్, బిఆర్ఎస్ సర్పంచ్‌లు ఆరుగురు గెలుపొందారు. అశ్వాపురంలో 11 చోట్ల కాంగ్రెస్, ఐదు చోట్ల బిఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందగా మరికొన్ని చోట్ల ఫలితాలు రావాల్సి ఉంది.

### ప్రశాంతంగా ముగిసిన పోలింగ్...

తొలి విడత ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఉదయం ఏడు గంటల నుంచి గ్రామాల్లో పోలింగ్ మొదలైంది. అధికార యంత్రాంగం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఘర్షణలు జరిగే అవకాశం ఉన్న గ్రామాల్లో భారీ పికెటింగ్ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , సిపి సునీల్ దత్ పలు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల సరళిని పరిశీలించారు. భద్రాచలం పంచాయతీలో పోలింగ్‌లో గందరగోళం కారణంగా అతి తక్కువ ఓట్లు నమోదయ్యాయి. ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ పలు కేంద్రాల్లో పర్యటించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఈ దఫా ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది.

# న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి

-బార్ కౌన్సిల్ సభ్యునిగా గెలిపించండి : దుస్సా జనార్థన్



ప్రజాపక్షం/ ఖమ్మం : న్యాయవాదుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని బార్ కౌన్సిల్‌కు పోటీ చేస్తున్న దుస్సా జనార్థన్ తెలిపారు. గురువారం ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొండపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దుస్సా జనార్థన్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ సభ్యునిగా తనకు ఓటేసి గెలిపించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం బార్ కౌన్సిల్ సభ్యునిగా పోరాడతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ అధ్యక్షులు షేక్ లతీఫ్, కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి దిలీప్, సీనియర్ న్యాయవాదులు పోట్ల మాధవరావు, అమర్‌చంద్, పట్టాభి, షేక్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాక్షేత్రంలో ఉండే వారినే గెలిపించండి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల ప్రచారం గురువారం విస్తృతంగా నిర్వహించారు. సిపిఐ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులకు ఓట్లేసి బంపర్ మెజారిటీతో గెలిపించాలన్నారు. యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు ఎంఎల్‌ఏ కూనంనేనికి ఘనస్వాగతం పలికారు. ఈ సంధర్భంగా స్థానిక సమస్యలను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, వృద్ధులకు ఫించన్ రావటం లేదని ఫిర్యాదు చేశారు. దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఎల్‌ఏ కూనంనేని మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికలలో మంచి మెజారిటీతో నాపై నమ్మకంతో, అభిమానంతో గుండెల్లో పెట్టుకొని గెలిపించిన పాల్వంచ ప్రజల అభిమానం మరువలేనిదన్నారు. అవినీతికి తావులేకుండా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్ది రుణం తీర్చుకొంటానని అన్నారు. అదే విధంగా సర్పంచ్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. దీనితో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను నెరవేర్చే బాధ్యత నాదే అన్నారు. గడిచిన రెండేండ్లలో కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ప్రతీ పల్లె, ప్రతీ వార్డులో, ప్రతీ పల్లెలో ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ఇప్పటికే మంజూరైన ఉన్నటువంటి పనులను ఎన్నికలు పూర్తి అయిన వెంటనే మొదలుపెట్టనున్నట్లు పేర్కొన్నారు. నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కారం కోసం సిపిఐ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజారిటీ గెలిపించాలని కోరారు. కొత్తగూడెం నియోజక వర్గంలో ప్రజా పోరాటాలకు మద్దతునిస్తూ పలు పంచాయితీలను సిపిఐ బలపరిచిన అభ్యర్థులను ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల పునరావృతమయ్యే విధంగాప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని ఉద్యమాల పార్టీ సిపిఐకి నైతిక బలాన్ని కల్పించాలని కోరారు. నోటుకు, మందుకు, ప్రలోభాలకు లొంగకుండా విచక్షణతో ఆలోచించి ప్రజా ఉద్యమాల వందేండ్ల చరిత్ర గల సిపిఐ బలపరిచిన అభ్యర్థులకు ఓటేసి అధిక మెజారిటీతో ఒక్కసారి అవకాశం కల్పించి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా నాయకులు వీసంశెట్టి పద్మజ, నాయకులు వైఎస్ గిరి, కోమటి శ్రీనివాసరావు, వజ్జా వాసు, సర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. పలువురు చిన్నారులు ఎర్ర కండువాలు కప్పుకొన్న చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# చింతకానిలో విజేతలు వీరే





ప్రజాపక్షం/చింతకాని : తొలివిడత జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చింత కాని మండలంలో రాఘవా పురం సర్పంచ్ కాంపల్లి కోటమ్మ (సిపిఐ) , రేపల్లె వాడ మడిపల్లి అంబిక (కాంగ్రెస్) ఏకగ్రీవంగా ఎన్నికవ గా గురువారం జరిగిన 24 పంచాయతీల్లో బస్వాపురం ఆవుల నర్సింహారావు 8 ఓట్ల మెజార్టీ, నేరడ దూసరి నేతాజీ (సిపిఐ) 425 ఓట్ల మెజార్టీ, నాగిలిగొండ ఏపూరి పద్మ 34 ఓట్ల మెజార్టీ , అనంతసాగర్ జడ ప్రమీల (కాంగ్రెస్) 35 ఓట్ల మెజార్టీ , బొప్పారం షేక్ రహమతుల్లా (బారాస)72 ఓట్ల మెజార్టీ , గాంధీనగర్ కాలనీ ఓర్సు వీరభద్రం (కాంగ్రెస్) 374 ఓట్ల మెజార్టీ , జగన్నాథపురం తాళ్లూరి స్వప్న (కాంగ్రెస్) 94ఓట్ల మెజార్టీ , కొదుమూరు బయ్యా నాగరాణి (సిపిఎం) 133 ఓట్ల మెజార్టీ , కోమట్లగూడెం కొండూరి పరిశుద్ధరావు (బారాస) 370ఓట్ల మెజార్టీ , లచ్చగూడెం కొప్పుల రజిని( కాంగ్రెస్) 1292 ఓట్ల మెజార్టీ , మత్కేపల్లి కంచం ద్రౌపతి (కాంగ్రెస్)386 ఓట్ల మెజార్టీ , నాగిలిగొండ ఏపూరి పద్మ(సిపిఐ)34 ఓట్ల మెజార్టీ , నర్సింహాపురం లోయ ఉపేందర్ (కాంగ్రెస్) 100 ఓట్ల మెజార్టీ , పందిళ్లపల్లి వత్సవాయి పద్మ(సీపీఎం) 84 ఓట్ల మెజార్టీ , రైల్వేకాలనీ లేతాకుల నాగేంద్ర (సీపీఎం) 16 ఓట్ల మెజార్టీ , రామకృష్ణాపురం గాదె నాగలక్ష్మి (కాంగ్రెస్)ఓట్ల 298 మెజార్టీ , సీతంపేట ఆళ్ల మణి (కాంగ్రెస్) 292 ఓట్ల మెజార్టీ ,తిమ్మినేనిపాలెం లో బారాస అభ్యర్థి కొమ్ము ప్రభు (బారాస)133 ఓట్ల మెజార్టీ , తిరుమలాపురం (బారాస) అభ్యర్థి చాపలమడుగు వీరబాబు(బారాస) 6 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వందనంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల నాగేశ్వరరావు 49 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

# పంచాయతీ ఎన్నికల్లో రఘునాథపాలెం మండలంలో హోరాహోరీ పోరు






















### - కాంగ్రెస్ 20, బిఆర్ఎస్ 11 స్థానాల్లో విజయం

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల తరుపున పోటీ చేసిన అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరు కొనసాగింది. గురువారం తొలి విడత మండలంలో 32 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగగా కాంగ్రెస్ 20 స్థానాల్లో, బిఆర్ఎస్ 11 స్థానాల్లో విజయం సాధించాయి. కాంగ్రెస్ నుంచి చింతగుర్తి తమ్మిని ప్రియాంక, గణేశ్వరం భూక్యా నాగేశ్వరరావు, పంగిడి నుంచి భూక్యా స్వాతి, జింకల తండా దరావత్ సుగుణ, పరికలబోడు తండా తేజావత్ శిరీష గోపి, బావోజీతండా దరావత్ మంగ్లీ, హర్యాతండా బానోత్ స్వాతి, పుఠానితండా మూడు చిన్న, సూర్యతండా బానోత్ సక్రియ, రజబ్ అలీ నగర్ బానోత్ దర్నీ, దొనబండ తేజావత్ నవీన్, కొర్లబోడుతండా భూక్యా చిన్నయ్య, చిమ్మపుడి కోటేరు నర్సిరెడ్డి, విఆర్ బంజర భూక్యా రమణ, పాపటపల్లి ఊయ్యూరు దాక్షావతి, కోయచలక బలుసుపాటి శేషయ్య, ఈర్లపుడి కేలోత్ గీత, చెరువుకొమ్ము తండా భూక్యా బాషా, పువ్వాడ నగర్ సిద్దిఖ్, బూడిదం పాడు కూరపాటి విజయకుమారి విజయం సాధించారు. బిఆర్ఎస్ తరుపున వేపకుంట్లలో పొట్లపల్లి రమాదేవి, బాద్యతండాలో నునావత్ పెంట్యా, రాంక్యాతండాలో తేజావత్ మూర్తి, కెవి బంజరలో భూక్యా సరిత, ఎన్‌వి బంజరలో జర్పుల సౌందర్య, మూలగూడెంలో జర్పుల రవీందర్, లచ్చిరాంతండాలో మాలోత్ సుశీల, జికె బంజరలో మాలోత్ జ్యోతి, శివాయిగూడెంలో బానోత్ సునీత, మంచుకొండలో తేజావత్ శంకర్, కోటపాడులో కొంటెముక్కుల నాగేశ్వరరావు లు విజయం సాధించారు.

# సిపిఐ అభ్యర్థుల గెలుపుకై ముమ్మర ప్రచారం



**- ఇంటింటికి తిరిగి ఓటు అభ్యర్థించిన దండి**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని సిపిఐ బలపరిచిన అభ్యర్థులు,పలు పార్టీలు బలపరిచిన సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ గురువారం ముమ్మర ప్రచారాన్ని నిర్వహించారు. ఈ మేరకు చింతపల్లి, ఆరెకోడు, ఆరెకోడుతండా, కస్నాతండా, గూడూరుపాడు, కామంచికల్, పడమటి తండా గ్రామాలలో అభ్యర్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. అలాగే నిర్వహించిన ప్రచార జాతాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్ అభ్యర్థుల విజయానికై గూడూరుపాడులో ప్రసగించారు. కాగా ప్రచారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రజల ఆధారభిమానాలతో విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, చెరుకుపల్లి భాస్కర్, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, కళాకారుడు సతీష్, సిపిఐ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను గెలిపించండి



**ఎమ్మెల్యే రాగమయి**

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాల అభివృద్ధి దేశ అభివృద్ధి అని సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె గురువారం పెనుబల్లి మండలంలో పర్యటించారు. ఈనెల 17వ తేదీన జరిగే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని గ్రామాలలో రోడ్ షో నిర్వహించారు. ఏరుగట్ల గ్రామంలో రాష్ట్ర నేత డాక్టర్ మట్టా దయానంద్ పర్యటించి రోడ్డు షో నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. భవన్నపాలెం, పార్థసారథి పురం, రామచంద్ర రావు బంజర్, వియం బంజర్, బయ్యన్నగూడెం, పాత కుప్పనగుంట్ల, కుప్పెనకుంట్ల, తుమ్మలపల్లి, ముత్తగూడెం గ్రామపంచాయతీలలో ఎమ్మెల్యే రోడ్డు షో నిర్వహించి ప్రజలకు అభివాదం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# పంచాయతీ పోలింగ్‌కు భద్రత కట్టుదిట్టం




**- సిపి సునిల్‌దత్**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లాలో కట్టుదిట్టమైన భద్రత, పోలీస్ పహారానడుమ మొదటి విడత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తుతో పోలీసు డివిజనల్ స్థాయి అధికారులు పర్యవేక్షించారన్నారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు సమయంలో ఘర్షణలు జరగకుండా ముందస్తుగా పోలీసు పహారా ఉంచామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎక్కువ మంది గుమ్మిగూడకుండా చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలు సృష్టించే వ్యక్తులను ఆరువేల మందిని గుర్తించి బైండవర్లు చేశామని సిపి పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి బందోబస్తులో ఉన్న పోలీసు అధికారులకు సూచనలు చేశామని తెలిపారు.

# దుమ్ముగూడెం మండలంలో సిపిఐ విజయకేతనం











**- పోటీ చేసిన నాలుగు స్థానాలు కైవసం**

**- ఉపసర్పంచ్‌లుగా రావులపల్లి రవి, అనిత,**

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం :** గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ విజయకేతనం ఎగురవేసింది. మండలంలో మొత్తం నాలుగు గ్రామ పంచాయితీల్లో సిపిఐ పోటీలో నిలువగ ఆ నాలుగు స్థానాలను కైవసం చేసుకుంది. తూరుబాక సర్పంచ్‌గా అజ్మీర శైలజ, నర్సాపురం సర్పంచ్‌గా కుంజా కనకరత్నం, పెద్ద ఆర్లగూడెం సర్పంచ్‌గా పాయం వెంకటేశ్వర్లు, బి కొత్తగూడెం సర్పంచ్‌గా కుంజా ప్రమీల గెలుపొందారు. అదేవిధంగా నర్సాపురం ఉపసర్పంచ్‌గా రావులపల్లి రవికుమార్, కొత్త దంతెనం ఉప సర్పంచ్‌గా బొమ్మెడి అనితా దేవి, పెద్ద ఆర్లగూడెం ఉప సర్పంచ్‌గా తాటి నాగేశ్వరరావు, బి కొత్తగూడెం ఉప సర్పంచ్ కాటిబోయిన లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా పెద్ద ఆర్లగూడెంలో 10 వార్డులు ఉండగా సిపిఐకి మూడు ఏకగ్రీవం కాగా మరో మూడు స్థానాల్లో గెలుపొందింది. నర్సాపురంలో పది వార్డులకు గానూ ఆరు సిపిఐ ఖాతాలో చేరాయి. బి.కొత్తగూడెంలో 8 వార్డులకు గానూ ఐదు వార్డుల్లో తూరుబాకలో పది వార్డులకు గానూ సిపిఐ మూడు వార్డులు కైవసం చేసుకుంది. విజయం సాధించిన అభ్యర్థులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ అభినందించారు.

# వైరా మండలంలో ప్రశాంతంగా పోలింగ్

**-మండలంలో 90.67% పోలింగ్ నమోదు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో 90.67% ఎన్నికల పోలింబగ్ పర్సంటేజ్ నమోదైంది. అత్యధికంగా కొష్టాల గ్రామంలో 94.88% నమోదు కాగా, అతి తక్కువగా సిరిపురం కెజిలో 87.63% పోలింగ్ నమోదైంది. 18 గ్రామపంచాయతీల్లో జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. పోలీసులు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మండల వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతం

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలంలో గురువారం జరిగిన గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు అన్ని గ్రామాల్లో ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జరిగినట్లు మండల ప్రత్యేకాధికారి విజయచంద్ర, ఎంపిడిఓ బి.సురేంద్ర తెలిపారు. అన్ని గ్రామాల్లో ఉదయం 7గంటల నుండి మొదలై 1గంట వరకు ముమ్మరంగా కొనసాగింది. కొన్ని గ్రామాల్లో 12గంటలకే ఓటింగ్ పూర్తయింది. ఉదయం 7గంటల నండి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మండలంలో 283 వార్డులకు, 25 గ్రామపంచాయతీలకు జరిగిన ఎన్నికలకు పిడి డిపిఓలు 547మంది, 34మంది ఆర్వోలు, 100 మంది పోలిస్ సిబ్బంది విధులు నిర్వహించారు. ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ముగియగానే అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో అధికారులు బ్యాలెట్ బాక్స్‌లకు సీలు వేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా స్థానిక ఎస్సై రమేష్ బందోబస్తు పర్యవేక్షించారు. వైరా ఎసిపి వసుంధరరర యాదవ్ ఎర్రుపాలెం జడ్పిఎస్ఎస్ స్కూల్ జరుగుతున్న ఓటింగ్ కేంద్రాన్ని ఎస్సై రమేష్, కార్యదర్శి ఏలేశ్వరరావుతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం మండలంలో పోలింగ్ కేంద్రాలను ఎసిపి సందర్శించారు. రెండు గంటల తర్వాత ఎన్నికల అధికారులు అభ్యర్థుల కౌటింగ్ ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ముందుగా వార్డు సభ్యులు, అనంతరం సర్పంచ్ కౌటింగ్ చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తికాగానే గెలిచిన అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు ఓట్ల లెక్కింపు కేంద్రంలోఅధికారికంగా ధృవపత్రాలను అందచేశారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నికలను నిర్వహించారు.

# చింతకాని 91 శాతం పోలింగ్



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలంలో గురువారం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగగా మొత్తం 41707 ఓట్లకు గాను 37028 ఓట్లు పోలయి 91 శాతం పోలింగ్ నమోదైంది. గ్రామల వారీగా చూస్తే అత్యదికంగా తిరుమలాపురం, వందనం గ్రామా ల్లో 96శాతం ఓట్లు పోలవ్వగా, మత్కేపల్లి, బస్వాపురం, రామకృష్ణాపురం గ్రామాల్లో 95 శాతం , అత్యల్పంగా కోమట్లగూడెంలో 84 శాతం పోలింగ్ జరిగింది. స్వల్ప ఉద్రిక్తల నడుమ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల సరళిని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కాళిచరణ్ ఐఏఎస్ జగన్నాధపురం, చింతకాని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. నేరడ, ప్రొద్దుటూరు, కొదుమూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సీపీ సునిల్ దత్ పరిశీలించారు. కొదుమూరు పోలింగ్ తీరును అడిషినల్ కలెక్టర్ శ్రీజ పరిశీలించారు.

# తిరుమలాయపాలెం మండలంలో వెయ్యిమంది బైండోవర్



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో డిసెంబర్ 14న జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు వెయ్యి మందిని బైండోవర్ చేసినట్లు స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు. మండలంలోని 40గ్రామపంచాయతీల పరిధిలో ఎన్నికలు జరుగుతుండగా ఐదు గ్రామపంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికల జరుగగా హస్నాబాద్ గ్రామపంచాయతీ అక్కడ సర్పంచ్ అభ్యర్థి కొవ్వూరి పద్మ సింగిల్ నామినేషన్ రావడంతో వార్డు సభ్యులు పోటీల్లో ఉండగా అక్కడ కూడా ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ పోటీలో ఉన్న అభ్యర్థులు, వార్డు సభ్యులను బైండోవర్ చేయటంతో పాటు గత ఎన్నికల్లో పరోక్షంగా ప్రత్యక్షంగా పాల్గొని ఘర్షణలకు పాల్పడే వారిని బైండోవర్ చేశారు. దీంతో పాటు ఇసుక ట్రాక్టర్ల ఓనర్లు, రౌడీషీటర్లు మొత్తం వెయ్యిమందిని గుర్తించామని ఆయన తెలిపారు. మండలంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలని, ఎవరైనా ఘర్షణలకు పాల్పడి ఎన్నికలకు ఆటంకం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని ఆయన హెచ్చరించారు.

# అత్యధిక ఓట్లు వియం బంజర


**అతి స్వల్ప ఓట్లు చౌడవరం**

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. 33 పంచాయతీలలో 32 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా రెండు పంచాయతీ ఏకగ్రీవం అయ్యాయి. 30 పంచాయతీలకు మూడో విడతలో 17 న ఎన్నికలు నిర్వహించనున్నారు. మండలంలో అత్యధిక ఓటర్లు వియం బంజర గ్రామపంచాయతీలో తమ ఓటుని వినియోగించుకోనున్నారు. వియం బంజర్లో అత్యధికంగా 3,163 ఓటర్లు, పెనుబల్లి 2,927, చింతగూడెం 2,656 ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా కే డబ్ల్యు చౌడారం పంచాయతీలో 493 ఓటర్లు ఉన్నారు. పార్థసారథి పురం పంచాయతీలు 619 ఓటర్లు, భవనపాలెం 712, కరాలపాడులో 728 ఓటర్లు ఉన్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

# ఇంటిగ్రేటెడ్ పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి తొలి సంతకం

## సర్పంచ్ అభ్యర్థిని కాకర్ల రేవతి





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈ నెల 17న జరగనున్న పంచాయతీ ఎన్నికలలో కత్తెర గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే గ్రామాభివృద్ధి ప్రదాత దాసరి మధుమోహన్ రెడ్డి ఆశీస్సులు, సహకారంతో గంగారం గ్రామంలో తొలి సంతకాన్ని ఇంటిగ్రేటెడ్ పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి చేస్తానని ప్రజలకు హామీ ఇస్తున్నారు సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌ల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని కాకర్ల రేవతి. తాను గెలిచిన కొన్ని నెలలలోనే గంగారం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి మెరుగుపరుస్తానన్నారు. గ్రామంలో త్రాగునీటి సమస్య లేకుండా చేస్తానని, గ్రామంలో పెండింగ్లో ఉన్న సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చూస్తానన్నారు. రాష్ట్రంలోనే గంగారం పంచాయతీని ఓ రోల్ మోడల్ గా తయారుచేసి, రాష్ట్ర మొత్తం గంగారం వైపు చూసేలా చేస్తానని ప్రజలకు హామీ ఇస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ గతంలో మధుమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ దూసుకుపోతున్నారు సర్పంచ్ అభ్యర్థిని రేవతి. కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే గ్రామ రూపురేఖలు మారుస్తానని అందులో మీరందరూ భాగస్వాములుగా ఉండాలని పిలుపునిస్తున్నారు. రేవతి ప్రచార కార్యక్రమంలో దాసరి మధుమోహన్ రెడ్డి, కోలగట్ల చెన్నారావు, మారేష్, కావేటి అప్పారావు, మహేష్, వూకే చలమారావు తదితరులున్నారు.

# గ్రామాభివృద్ధి ప్రధాన లక్ష్యం

## సర్పంచ్ అభ్యర్థి పొన్నగంటి జోగారావు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈ నెల 17న పంచాయతీ ఎన్నికలలో కిష్టాపురం నుండి సత్తుపల్లి శాసనసభ్యులు డా. మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ సహకారంతో, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్నానని తనకు గ్రామాభివృద్ధి ప్రధాన లక్ష్యమని మరో ఎజెండా లేదని తనకు కేటాయించిన బ్యాట్ గుర్తుపై ఓటర్లంతా ఓట్లు వేసి గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానంటున్నాడు సర్పంచ్ అభ్యర్థి పొన్నగంటి జోగారావు. ప్రజలకు సేవ చేయటంలో ముందుంటాడని మొదటి నుండి జోగారావుకి గ్రామంలో మంచి పేరుంది. తన, మన బేధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించటమే కాకుండా లో ఓల్టేజ్ సమస్యతో బాధపడుతున్న రైతులు, ప్రజల కష్టాలను గుర్తించి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి సబ్ స్టేషన్ నిర్మించేలా కృషి జరిపారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో బ్యాట్ గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే గ్రామంలో త్రాగునీటి సమస్య లేకుండా చేస్తానని, ఎమ్మెల్యే సహకారంతో తండా కాలనీలో నూతన బోరు మంజూరు చేయించి, పైప్ లైన్ వేయించి వారి నీటి కష్టాలు తీరుస్తానంటున్నాడు. తనను తన ప్యానెల్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు జోగారావు. ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్న జోగారావు కిష్టాపురం గ్రామస్తుల నుండి ఘన స్వాగతం లభిస్తుంది.

# లోయలో పడ్డ యాసిడ్ లారీ

## - డ్రైవర్ మృతి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అర్ధరాత్రి వేళ హైడ్రోక్లోరిక్ యాసిడ్ లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి లోయలో పడటంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో లారీ క్యాబిన్‌లోనే డ్రైవర్ చిక్కుకుపోయాడు. సుదీర్ఘ రెస్క్యూ ఆపరేషన్ తర్వాత మృతి చెందాడు. కాకినాడ నుండి పాల్వంచ వైపు వెళ్తున్న హైడ్రోక్లోరిక్ యాసిడ్ లారీ అర్ధరాత్రి సమయంలో లారీ ములకలపల్లి సమీపంలోని పాములేరు వాగు బ్రిడ్జి వద్ద అదుపు తప్పి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాద తీవ్రతకు లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి ఫైర్ సమాచారం అందించారు. లారీలో ప్రమాదకరమైన యాసిడ్ ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. సుమారు 8గంటల పాటు రెస్క్యూటీం శ్రమించి లారీని వెలికితీసే ప్రయత్నం చేసింది. రెస్క్యూ సిబ్బంది ఎంత ప్రయత్నించినప్పటికీ, లారీ నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్‌ను ప్రాణాలతో కాపాడలేకపోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# కూసుమంచిలో మండలంలో కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్

- -పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మధ్యనే సర్పంచ్ అభ్యర్థుల పోటాపోటీ
- -మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిల వైఫల్యం అంటూ కాంగ్రెస్ కార్యకర్తల నిరసన
- -పాత కాంగ్రెస్ కొత్త కాంగ్రెస్ కార్యకర్తల్లో పొసకని ఐక్యత





**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ వర్సెస్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పోటీలో ఉంటూ రాజకీయంగా పెద్ద చర్చనీయాంశమైన అంశంగా మార్చారు. పాలేరు నియోజకవర్గం ఎంఎల్ఏ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అనేక అంశాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఉక్కు క్రమ శిక్షణను నూరిపోస్తూ కాంగ్రెస్ పార్టీ ఐక్యత రాగం చెప్పుతున్నటికీ అటువంటివి ఏమి ఒక్కడ పని చేయవు అన్నట్లుగా వ్యవహరించిన పలువురు కాంగ్రెస్ నాయకుల తీరు అటు మంత్రికి ఇటు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు తీవ్రమైన ఆ ప్రతిష్టకు గురి చేస్తుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. వివరాల్లోకొస్తే కూసుమంచి మండలంలో గోరిలపాడు గ్రామ పంచాయితీ అభ్యర్థులుగా పాత కాంగ్రెస్ పార్టీలో ఎంతో కాలంగా మేము పనిచేశామని మాకే గ్రామ సర్పంచ్ పదవికి పోటీ చేసే అవకాశం ఉందని బానోతు లక్ష్మ నాయక్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా తాను డోర్ పోస్టర్లో ప్రతులు ప్రచురించుకొని ముఖ్యమంత్రి మంత్రుల ఫోటోలతో తనకు కేటాయించిన బ్యాట్ గుర్తుతో ప్రచారం చేస్తుండగా, మాజీ ఎంపీపీ బానోత్ సరస్వతీ శ్రీనివాస్ పేరుతో మరొకరు మేమే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గోరీలపాడు గ్రామ పంచాయితీ అభ్యర్థిగా వీరు సైతం ముఖ్యమంత్రి మంత్రుల ఫోటోలతో కత్తెర గుర్తుకు ఓట్లు వేయాలని డోర్ పోస్టర్లు కరపత్రాలతో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మంటూ తిరుగుతూ ప్రచారం చేసుకోవడం వీరి ఇరువురి చర్యలు గ్రామ ప్రజలు బిత్తరపోయే విధంగా ఉన్నది. ఈ క్రమంలో ఎవరో ఒకరు గెలిస్తే మిగతా వారు ఏమవుతారో చెప్పనక్కర్లేదు. ఇక బోడియాతండ గ్రామ పంచాయితీలో మరో రకమైన తీరు కనిపిస్తుంది. బోడియాతండా గ్రామ పంచాయితీ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని నేను అని చెప్పుకుంటున్న బోడ వీరు కత్తెర గుర్తుపై పోటీ చేస్తూ తన డోర్ పోస్టర్లు కరపత్రాలపై ముఖ్యమంత్రి, మంత్రుల స్టిక్కర్లతో ఫోటోలతో గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటుండగా అదే గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రెబెల్ పేరుతో బానోతు రవి బాబు ఉంగరం గుర్తుతో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా ముఖ్యమంత్రి మంత్రుల బొమ్మలతో తాను గ్రామంలో గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా పోటీలో ఉన్నానని గెలిపించాలని ప్రచారం చేసుకోవడం ప్రజలను అయోమయానికి గురి చేస్తుంది. ఇంకా వీరే కాక లింగరాం తండ గ్రామ పంచాయితీలో అంతర్గతంగా ఇదే కుమ్ములాట కొనసాగటం కూడా అంతర్గత పోరుగా కూసుమంచి మండల రాజకీయాల్లో చర్చనీయాంశమైన అంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ మండల ఇన్చార్జిలో వైఫల్యం వల్లనే ఈ రకమైన అంతర్గత పోరాటాలు పాత కాంగ్రెస్ కొత్త కాంగ్రెస్ మధ్య వైరుద్యాలు సమన్వయ లోపాలు సరైన నాయకుడు కనిపించడంలేదని విమర్శలు ప్రజాస్వామ్యం అని తీవ్రంగా వినిపిస్తున్నప్పటికీ రానున్న గ్రామ పంచాయితీ ఎన్నికల ఫలితాల అనంతరం కూసుమంచి మండలం కాంగ్రెస్ పార్టీలో ఓడిపోయిన అభ్యర్థుల భవితవ్యం ఏమవుతుందో అనే అంశంపై అది ఎటువైపు అయినా దారి తీయవచ్చు అని రాజకీయ పరిశీలకులకు భావిస్తున్నారు. కూసుమంచి మండలంలో ఇప్పటికే అనేక గ్రామ పంచాయితీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తమను గెలిపించాలని హోరాహోరీ పోరులో తమ ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు బిఆర్ఎస్, సిపిఎం, న్యూడెమోక్రసీ, బిజెపి పార్టీలతో పోరాడుతున్నారు. వీరి ఫలితాలు ఏ చూడడమే తప్ప నిర్భయంగా వడ్డెక్కేది ఏమి కనిపించడం లేదని పలు పార్టీల నాయకులు భావిస్తున్నారు.

# కొండాపురం కాంగ్రెస్ వైపే..

- - మంత్రి పొంగులేటి బలంతో ధీమాలో కాంగ్రెస్ శ్రేణులు
- - కలిసి వస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, పథకాలు
- - ప్రజల ఆదరణతో ముమ్మరంగా సాగుతున్న ప్రచారం





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం జిల్లాకు కూత వేటుదూరంలోని ఖమ్మంరూరల్ మండలంలోని కొండాపురం గ్రా మం తెలీనివారుండరు. జిల్లా, రాష్ట్రం, ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులకు సైతం ఎంతో ఫేమస్ కూడా. కానీ ఇవన్నీ నాణేనికి ఒక వైపు మాత్రమేనన్నది ఇక్కడి కాంగ్రెస్ పార్టీ శ్రేణుల వాదన. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంగా ఉందని, అభివృద్ధి శూన్యం అంటున్నారు. అభివృద్ధి కాముకుడు మంత్రి పొంగులేటి శీనన్న ఆశీస్సులతో అభివృద్ధితో ఊరికి పేరు,ప్రఖ్యాతి తీసుకువస్తామంటున్నారు. ఇక హంగు, ఆర్భాటాలకు చెల్లు చీటి పెట్టి కొండాపురంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేసేందుకు ప్రజలు సిద్ధమైనట్లు ధీమాను వ్యక్త పరుస్తున్నారు.

### మంత్రి బలంతో ముందుకు...

కాంగ్రెస్ నాయకులు దండ్యాల వెంకటేశ్వరరావు, నాగండ్ల శ్రీను ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బలంతో కాంగ్రెస్ ఉత్సాహంగా ముందుకు సాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, పథకాలు, సిసిరోడ్లతో ప్రజల్లో సానుకూలంగ ఉన్నరనే చెప్పాలి. అలాగే మంత్రి ఈ ప్రాంత అభివృద్ధిలో కృషి చేస్తానని చెప్పిన తరుణంలో ప్రజలు సైతం అభివృద్ధినే కోరుకుంటున్నారనిది సుస్పటమైంది. అధికారాలలో ఉండి సైతం పేదలకు అందని ద్రాక్షాల మారిన ఫ్లాట్ల సమస్య పరిష్కారం సానుకూలతను చూపిస్తుంది. పేదలకు రెండవ దఫాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, ప్రారంభానికి నోచుకోని నిర్మాణంలో నిలిచిన పనులకు సైతం మొక్షం కల్పిస్తానన్న మంత్రి అభయం ప్రజల యాదిలోకి వెళ్లడం మరో అడ్వాంటేజే.

### ఆశీర్వదించడి ఆదర్శంగా తీర్చిదిద్దుతా...

కొండాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటి చేస్తున్న నన్ను ఆశీర్వదిస్తే అన్ని రంగాలలో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని సిపిఐ, వైఎస్ఆర్‌సిపి, టిడిపి, జనసేన బలపరిచిన అభ్యర్థి దండ్యాల వాణిశ్రీ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండటంతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆశీస్సులు ఉండటంతో నిధులు తీసుకువచ్చి ఊరును అభివృద్ధి చేస్తానన్నారు. తన గెలుపు మాత్రమే మీదని అటు తర్వాత ప్రతి సమస్యను ఇంటికి వచ్చి పరిష్కారం చేసే బాధ్యత తనదేనన్నారు. అలాగే డ్రైయినేజీలు, సీసీరోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. రైతులకు ఇబ్బందులకు కలగకుండా పొలాలకు వెళ్లే లింక్‌రోడ్లను గ్రావెల్‌రోడ్డుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఇలా గ్రామంలో నెలకొన్న ప్రతి సమస్యను తనకిచ్చే అవకాశంతో పరిష్కారం చేపించేలా పనితీరు ఉంటుందన్నారు. అంతేకాకుండా మూలకు పడ్డ వైకుంతదామం, పారిశుద్ధ్యనిర్వహణశాల, పల్లె ప్రకృతివనాలను బాగు చేస్తానన్నారు. ఈ మేరకు ప్రజలు కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

# ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తున్న మద్యం..!

- -రాత్రివేళ గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- -మద్యంతో ఓటర్లను లోబర్చుకుంటున్న నాయకులు
- -పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు






**ప్రజాపక్షం/జూలూరుపాడు:** పల్లెల్లో ఎక్కడచూసినా ఓట్ల పండుగ సందడి చేస్తోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా మండలంలో బెల్టు షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీలలో మద్యం ఏరులై పారుతోంది. అభ్యర్థులు ప్రచారం చేయడానికి ముందే కొందరు ఓటర్లను మద్యంతో లోబర్చుకుంటున్నారు. ప్రచారం కాగానే తిరిగి మద్యంలో ముంచేస్తున్నారు. రాత్రి సమయంలో ఇదే తంతు కొనసాగుతోంది. ఇప్పటికే కొందరు నాయకులు అధికార అండ దండలతో సొంత వాహనాల్లో మద్యం గ్రామాలకు తరలించి వారి రహస్య స్థలాల్లో దాచిపెడుతున్నారని ప్రజలు బహిరంగానే చర్చించు కుంటున్నారు. ఎన్నికలకు ఇంకా ఐదు రోజులు సమయం ఉండటంతో చివరి రెండు రోజులు ఈతంతు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే బెల్ట్ షాప్‌లపై అధికారులు ఉక్కుపాదం మోపుతారు. కానీ, ఎన్నికల కోడ్ అమలులోవున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### నగదు, గిఫ్ట్ లతో పాటు మద్యం కీలకం...

పలువురు ఓటర్లను ఆకర్షించడంలో నగదు, గిఫ్ట్ లతో పాటు మద్యం కీలక పాత్ర పోషిస్తుంది. రోజువారీగా ఒక్కో బెల్ట్ దుకాణం నిర్వాహకుల కొనుగోలు కంటే అదనంగా ఖరీదు చేస్తున్నారు. ఇందులో ఎక్కువగా క్వార్టర్, ఆఫ్ బాటిల్స్ ఉంటున్నాయి.జూలూరుపాడు మండలంలో మూడో దశ ఎన్నికలు జరగనున్నాయి. అందులో భాగంగా 21 పంచాయతీలలో సర్పంచులు, వార్డు మెంబర్లు ఎన్నికల బరిలో ఉన్నారు. సర్పంచ్ లుగా 120 మంది, వార్డు సభ్యుల అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ రోజు నుంచి అభ్యర్థులు రోజు ప్రతి వార్డు, ప్రతి ఇల్లు తలుపు తట్టి ప్రచారం నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో తాము చేపట్టబోయే అభివృద్ధి పనులను ఓటర్లకు చెప్తూ ముందుకు సాగుతున్నారు.

### ఖర్చుకు వెనుకాడడంలేదు..

పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచారం కన్నా ప్రలోభాలపైనే ఆసక్తి చూపుతున్నారు. ప్రచారానికి ఖర్చు చేయడం కన్నా ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు ఎంతవరకైనా ఖర్చు చేయడానికి వెనుకాడడంలేదు. గతంలో ఎన్నికలకు ఒకరోజు ముందు క్వార్టర్ లేదా హాఫ్ బాటిల్ లిక్కర్‌ను ఓటర్ల ఇళ్లకు పంపించేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచే ఊరురా మందు పార్టీలు మొదలయ్యాయి. ఎలగైనా గెలవాలనే కసితో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చే సుకునేందుకు పోటాపోటీగా లిక్కర్ కొనుగోలుచేసి పంచుతున్నారు. దీనికితోడు ప్రచారంలో పాల్గొన్న వారందరికీ చుక్క, ముక్కతో విందులు ఏర్పాటు చేస్తున్నారు. మద్యం పంపిణీకి గ్రామంలోని బెల్టు షాపుల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. మరికొందరు నేరుగా వైన్స్ షాపుల నుంచి పెద్దమొత్తంలో కొనుగోలు చేసి లిక్కర్‌ను తమ అనుచరుల వద్ద స్టాక్ పెట్టించి రాత్రిపూట పంపిణీ చేయిస్తున్నారు.

### బహిరంగంగానే తరలింపు...

రోడ్లపై వాహనాలను తనిఖీ చేస్తూ నగదు, మద్యం నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే సీజ్ చేసే అధికార యంత్రాంగం బెల్ట్ షాపులకు మద్యం సరఫరా అవుతున్నా ఎందుకు ఫోకస్ చేయడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పరిమితంగానే మద్యం తీసుకెళ్లడానికి అనుమతి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా వైన్స్ షాపుల నుంచి మద్యం, బీర్లు బహిరంగంగానే మారుమూల ప్రాంతాల్లోని బెల్ట్ షాపులకు తరలిస్తూ 24 గంటలు మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. అయినా అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# కిక్కులో పల్లెలు..!

- -ఏరులై పారుతున్న మద్యం
- -కోడ్ అమలులో ఉన్న అతిక్రమణ
- -పెద్దమనుషులకు దావత్‌లు




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని మూడో విడత స్థానిక ఎన్నికల సమరంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతుంది. స్థానిక ఎన్నికల పండుగ సందర్భంగా కోడ్ అమలులోకి వచ్చి పది రోజులు దాటినా సంబంధిత శాఖ అధికారులు ఏమీ పట్టనట్లుగా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు విమర్శిస్తూ చర్చించుకుంటున్నారు. రాత్రివేళ సమయంలో యువతకు కోరుకున్న బీర్లు బ్రాండెడ్ అడిగినవి అందిస్తున్నారు. అదే విధంగా కుల పెద్దలకు పెద్ద పెద్ద దావతులు ఇస్తున్నారు. ఖర్చులకు అభ్యర్థులు వెనకాడడం లేదు. స్థానిక సమరంలో అభ్యర్థులు ప్రచారం ఖర్చులు కన్నా ప్రలోభాలకు ఎక్కువ ఆసక్తి కి బాధ్యత వహిస్తున్నారు. ప్రచారానికి ఖర్చు చేయడం కన్నా ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు ఎంత ఖర్చైనా ఖర్చు చేసేందుకు అభ్యర్థులు వెనకాడడం లేదు. గతంలో స్థానిక సమరంలో ఒక రోజు హాఫ్, ఫుల్లు, కేజీ చికెను ఇంటికి పంపిస్తే సరిపోయేది. కానీ ఇప్పుడు నామినేషన్ నుంచి ఎన్నిక అయ్యే వరకు పూర్తిగా మారిపోయింది. అభ్యర్థికి చుక్కలు చూపిస్తున్నారు ప్రతిరోజు రాత్రి మందు పార్టీలు ఊరూరా జరుగుతున్నాయి. కొందరు అభ్యర్థులు నేరుగా తన అనుచరుల వద్ద స్టాక్ పాయింట్ పెట్టి పంపకాలు చేస్తున్నట్లు సమాచారం.

### బహిరంగంగానే మద్యం తరలింపు..

బహిరంగంగానే తరలింపు బెల్ట్ షాపులకు మద్యం సరఫరా అవుతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజల్లో విమర్శ వస్తుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న పరిమితంగానే తీసుకెళ్లడానికి అవకాశం ఉంది. నిబంధనలకు విరుద్ధంగా వైన్స్ ల నుంచి గొలుసు కట్టు దుకాణాలకు రహస్యంగా తరలిస్తున్నట్లు గ్రామాల్లో చర్చలు కొనసాగుతున్నవి. అయినా కూడా గ్రామాల్లో సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

# గెలుపే లక్ష్యంగా..



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈ నెల 17న పంచాయతీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రజాబలంతో తుమ్మూరు గ్రామ సర్పంచ్ బరిలో నిలిచిన కూసంపూడి వీరబాబు గెలుపే లక్ష్యంగా తన ప్రచారాన్ని వేగవంతం చేశారు. గతంలో ప్రజలకు తాను చేసిన సేవలను గుర్తు చేస్తూ, తనను గెలిపిస్తే గ్రామానికి జరిగే మంచి ఏమిటి వివరిస్తూ అక్క,చెల్లెమ్మలను కలుసుకుంటూ కత్తెర గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రచారంలో పాల్గొంటున్న వీరబాబుకు ఓటర్లు అపూర్వ స్వాగతం పలుకుతున్నారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ గ్రామ పంచాయితీలో పలు వార్డులలో కాంగ్రె స్ పార్టీ ప్రచారంలో దూసుకుపోతుంది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లి పూర్తిగా వివరిస్తూ ఓటును అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేసే సంక్షేమ పథకాలు ఉచిత కరెంటు ఇందిరమ్మ ఇల్లు సన్న బియ్యం ఉచిత బస్సు గ్యాస్ సబ్సిడీ రేషన్ కార్డులు తదితర పథకాలను ప్రజలకు చేరవేస్తూ ఓటుని అడుగుతు తమదైన శైలిలు ముందుకు అడుగులు వేస్తున్నారు. రాబోయే రోజుల్కలో చంద్రుగొండ పంచాయితీలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లో పంచాయితీ పరిధిలో పేదలకు ఇండ్లు పూర్తి చేసి తీరుతామని హామీ ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇల్లు గానీ రేషన్ కార్డులు ఇచ్చిన పాపానపోలేదని అన్నారు. ఈ ప్రచారంలో ఆ పార్టీ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, కొదుమూరి దయాకర్‌రావు, తుమ్మలపల్లి సురేష్, ఉప్పతల ఏడుకొండలు, సంక శంకర్, అన్వర్, కృష్ణవేణి, పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి ఇస్లావత్ రుక్మిణి, వార్డుకు పోటీ చేస్తున్న సభ్యులు పాల్గొన్నారు.

# బాదావత్ కవితను గెలిపించండి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ బలపరిచిన మాదారం గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థి బాదావత్ కవితని అత్యధిక మెజార్టీతో మూడవ నెంబర్ బ్యాట్ గుర్తుపై తమ అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ ప్రచారంలో భాగంగా గోవింద తండా గ్రామంలో ప్రచారం, జనరల్ బాడీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ఏ న్యూడెమోక్రసీ కారేపల్లి మండల కార్యదర్శి వై ప్రకాష్ కోయల శ్రీనివాస్ వై జానకి కావేటి నాగేశ్వరరావు బి వీరు గోవిందు పాపారావు పాల్గొని ఈనెల 17న జరిగే మాదారం గ్రామ పంచాయితీ ఎన్నికలలో అవినీతి అవకాశవాద మద్యం మాంసం డబ్బులను పంపి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే పార్టీలను ఓడించాలని నిరంతరం ప్రజా సమస్యలపై ఎన్నో త్యాగాలు చేసి రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ బలపరిచిన అభ్యర్థి కామ్రేడ్ బాదావత్ కవితని భారీ మెజార్టీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి తోడ్పాడాలని గ్రామ ప్రజలందరినీ ఈసందర్భంగా కోరారు.

# అయ్యప్ప దీక్ష ఎంతో కఠినం, పవిత్రం



**ప్రజాపక్షం/కారేపల్లి:** అయ్యప్ప దీక్ష ఎంతో కఠినం పవిత్రమని, అయ్యప్ప మకర జ్యోతి పీఠం మాలదారుల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమని బెల్ కంపెనీ మేనేజర్ గుగులోత్ రవి కుమార్ అన్నారు. కారేపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం సమీపంలో గల అయ్యప్ప మకరజ్యోతి పీఠం మాలదారుల ఇరుముడి కార్యక్రమం సందర్భంగా బెల్ కంపెనీ మేనేజర్ మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదానాన్ని గురుస్వాములతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష మాలధారుల, భక్తుల కోరికలు నెరవేరాలని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఇరుముడి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం గురుస్వాములు రవికుమార్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఇమ్మడి తిరుపతిరావు, పోలగాని శ్రీను, మేదరి ప్రతాప్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఉంగరం గుర్తుపై ఓటెయ్యండి

## కాంగ్రెస్ పార్టీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థి చీకటి చిట్టీరావు






**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈనెల 17న జరగనున్న సర్పంచ్ ఎన్నికలలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. దయానంద్ ల ఆశీస్సులతో తుంబూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచానని మీ అందరూ ఆశీర్వాదం అందించి, ఉంగరం గుర్తుపై ఓటేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు తుంబూరు సర్పంచ్ అభ్యర్థి చీకటి చిట్టీరావు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో, ఎమ్మెల్యే దంపతులు ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికి చేర్చి పేదలకు చేదోడు, వాదోడుగా ఉంటానంటున్నారు. ప్రజల కష్టం తెలిసిన వాడిగా, ప్రజల మనిషిగా, మీలో ఒకడిగా ఉంటానని ఆదరించి ఉంగరం గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు చిట్టీరావు. తాను గెలిస్తే గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం తో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అందేలా చూస్తానని మాటిస్తున్నారు.

# జిల్లాలో 71.79 శాతం ఓటింగ్

- అత్యధికంగా దుమ్ముగూడెం, అత్యల్పంగా భద్రాచలం
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు









**జిల్లా వారీగా ఓటింగ్ సరళి**

| | | |
|---|---|---|
| 1. అశ్వాపురం | 25743(32860) | 78.34 శాతం |
| 2. భద్రాచలం | 19920(40761) | 48.87 శాతం |
| 3. బూర్గంపాడు | 31018(44878) | 69.12 శాతం |
| 4. చర్ల | 26637( 32653) | 81.58 శాతం |
| 5. దుమ్ముగూడెం | 28231(33182) | 85.05 శాతం |
| 6. కరకగూడెం | 10887(12869) | 84.52 శాతం |
| 7. మణుగూరు | 22783(36480) | 62.45 శాతం |
| 8. పినపాక | 20765(25387) | 81.79 శాతం |
| **మొత్తం** | **259070(185974)** | **71.79 శాతం** |



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన తొలివిడతలో జిల్లా వ్యాప్తంగా 71.79 శాతం ఓటింగ్ నమోదైంది. 159 గ్రామ పంచాయితీలు, 1436 వార్డులున్న భద్రాచలం, పినపాక నియోజకర్గాల పరిధిలోని చర్ల,దుమ్ముగూడెం, భద్రాచలం,బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల్లో తొలివిడత ఎన్నికలు పూర్తయ్యాయి. కొన్ని మండలాల్లోని పంచాయితీల్లో ఎన్నికల ఫలితాలు వెలుపడినప్పటికీ అత్యధిక ఓటర్లు ఉన్న భద్రాచలం చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు, మణుగూరు వంటి మండాల్లో పూర్తి ఫలితాలు వెలువడాల్సి ఉంది. జిల్లాలోని అత్యధికంగా దుమ్ముగూడెం మండలంలో 85.08 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ మండలంలో 33182 మంది ఓటర్లకు గానూ 28231 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యల్పంగా భద్రాచలంలో 48.84 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇక్కడే 40761 మంది ఓట్లకు గానూ 19920 మంది మాత్రమే ఓటు వేశారు. ఉ.7 నుండే ఓట్లు వేసేందుకు అనుమతి ఉండటంతో పొంగమంచులో సైతం పోలింగ్ కేంద్రాల వద్దకు ప్రజలు చేరుకున్నారు. మధ్యాహ్నాం 1గం. సమయం పూర్తయిన తర్వాత కూడా కొందరు ఓటువేసేందుకు వచ్చి వెనుదిరిగారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లు అంతా ఓట్లు వేయడం పూర్తయిన తర్వాత ఎన్నికల సిబ్బంది బ్యాలెంట్ బాక్సులను లెక్కింపు కేంద్రాలకు తమకు కేటాయించిన వాహనాల్లో తరలించారు. భద్రాచలం, పినపాక ఎంఎల్ఓలు డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు సతీ సమేతంగా తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఆయా అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్న టెంట్ల వద్దకు చేరుకుని పలువురితో ముచ్చటించారు.

### ఎన్నికల సరళిని పరిశీలించిన అధికారులు..

తొలివిడత గ్రామ పంచాయితీ ఎన్నికల సరళిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించగా ఎస్‌పి రోహిత్ రాజ్ జిల్లాలోని అశ్వాపురం మండలం, మణుగూరు, బూర్గంపాడు, భద్రాచలం మండలాల్లో కలియ తిరిగి పరిశీలించారు. అదే విధంగా ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్‌తో భద్రాచలం పట్టణంలోని పలు కేంద్రాల్లో తన సిబ్బందితో కలిసి పరిశీలించారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఘోర వైఫల్యం

- ఏ బూతుల్లో ఓటు వేయాలో తెలియక వెనుదిరిగిన ఓటర్లు
- అత్యల్పంగా 48.87 శాతం పోలైన ఓట్లు
- భద్రాచలంలో ఓట్ల తికమక



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలంలో నిర్వహించిన గ్రామపంచాయితీ ఎన్నికల్లో ప్రభుత్వ యంత్రాంగం ఘోర వైఫల్యాన్ని మూటకట్టుకుంది. 13 సం.ల తర్వాత స్వరాష్ట్రంలో భద్రాచలం గ్రామపంచాయితీకి ఎన్నికలు నిర్వహించడంతో జిల్లా వ్యాప్తంగా అందరి దృష్టికి భద్రాచలంపైనే ఉంది. భద్రాచలం మేజర్ గ్రామ పంచాయితీ కావడంతో ఇక్కడ 40,760 మంది ఓటర్లు ఉన్నారు. ఇదే రాష్ట్రంలో అతిపెద్ద గ్రామ పంచాయితి. మొత్తం 20 వార్డులు ఉండటంతో ఈ 20 వార్డులకు ఓట్లు సర్ధుబాటు చేసే క్రమంలో ఒక్కొక్క వార్డుకు ఇటు అటుగా 2వేల ఓట్లు ఉండేలా చూశారు. దీంతో గతంలో ఉన్న వార్డుల్లో ఓట్లు వేరే వార్డుల్లోకి మారిపోయాయి. ఉదాహరణకు గతంలో 13 వార్డులో ఓటు ఉన్న వారు ఓట్ల సర్ధుబాటు కారణంగా 14 వార్డుకు,15వ వార్డుకు బదలాయించడంతో వారు ఆ వార్డులకు ఓట్లు వేయాల్సి వచ్చింది. దీంతో ఓటర్లు తీవ్ర గందరగోళానిగి గురయ్యారు. వార్డుల్లో ఓట్లు అటుఇటు మారి పోయానే విషయాన్ని ప్రజలకు తెలిపే విషయంలో సఫలీకృతం కాలేకపోయారు. మరో ప్రక్క ఇరవై వార్డుల వ్యాప్తంగా ప్రభుత్వ పరంగా అచ్చువేసిన స్లిప్పులు అందిచడంలో కూడా అలసత్వం ప్రదర్శించారు. ఆ స్లిప్పుల్లో ఏ వార్డులో ఉన్నారు. పోలింగ్ బూత్ నెంబర్ ఎంత అనేది స్పష్టంగా ఉంది. అవి సరిగా ఓటర్లకు చేరకపోవడంతో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వారు కూడా ఏ బూత్‌లో ఓటు వేయాలో తెలియక వెనుదిరిగారు. ఎన్నికల్లో పోటీ చేసిన సర్పంచ్, వార్డు సభ్యులు సైతం ఓటర్ల బూత్‌లు తెలిపే విధంగా ప్రయత్నాలు చేయలేదనేది స్పష్టంగా తేలిపోయింది. ఓటు వేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ వేయలేకపోవడంతో చాలా మంది నిరుత్సాహానికి గురయ్యారు. ఇగివా ఉండగా మధ్యాహ్నాం 1 గం. వరకే ఓటు వేసేందుకు సమయం ఉండటంతో చాలా మంది సమయం దాటిని తర్వాత పోలింగ్ కేంద్రాలకు రావడంతో వారు ఓటు వేసేందుకు అనుమతించలేదు.

### 48.87 శాతం పోలింగ్ :

భద్రాచలం గ్రామ పంచాయితీకి జరిగిన ఎన్నికల్లో 48.87 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. భద్రాచలం గ్రామపంచాయితీ ఎన్నికల చరిత్రలో అతి తక్కువ ఓట్లు పోలైంది ఈ సారే. మొత్తం 40760 మంది ఓటర్లు ఉండగా కేవలం 19920మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ఉత్తమ హరిత గృహముల పోటీలకు దరఖాస్తులకు ఆహ్వానం



**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 23వ తేదీ సింగరేణి దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని పివి కాలనీ, బంగ్లాస్ ఏరియాలోని కంపెనీ క్వార్టర్స్ నందు ఉత్తమ హరిత గృహములకు 19వ తేది ఉదయం 10:00 గంటల నుండి ఉత్తమ గృహాల ఎంపిక కొరకు కమిటీ సభ్యులు కాలనీలలో పర్యటించనున్నట్లు డిజిఎం (పర్సనల్) ఎస్. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ వారు పచ్చదనం పరిశుభ్రతతో కళకళలాడే ఉద్యోగుల గృహాలలో అత్యుత్తమమైన ఎంపిక చేసిన వాటిలో ఉత్తమ, కన్సోలేషన్ బహుమతులను సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల వేదికపై ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌చే బహుమతి ప్రధానం చేయబడుతుంది అన్నారు. కావున ఆసక్తి గల ఉద్యోగులు తమ యొక్క పేర్లను తేదీ: 18.12.2025 లోపు జిఎం కార్యలయంలోని పర్యావరణ విభాగం పర్యావరణ అధికారి జే శ్రీనివాస్ రావు (సెల్ : 8332974977) వద్ద నమోదు చేసుకోవలసినదిగా ఆయన తెలిపారు.

### సింగరేణి దినోత్సవం వేడుకల్లో స్టాల్స్ కొరకు ధరఖాస్తుల ఆహ్వానం...

సింగరేణి దినోత్సవ వేడుకలు 2025 ను పురస్కరించుకొని పివి కాలనీ భద్రాద్రి స్టేడియం నందు సింగరేణి ఆధ్వర్యంలో డిసెంబర్ 23న నిర్వహించబడనున్న సింగరేణి దినోత్సవం సందర్భంగా తినుబండారాలు, వివిధ రకాల స్టాల్స్ ను కంపెనీ నిబంధనలకు అనుగుణంగా పెట్టుకొనుటకు ఆసక్తి గల వ్యాపార వర్గాల వారు తమ దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా తమ దరఖాస్తులను జిఎం కార్యలయం లోని పర్సనల్ డిపార్ట్మెంట్ నందు అందజేసి తమ పేర్లను నమోదు చేసుకోవలసినదిగా డిజిఎం (పర్సనల్) ఎస్. రమేష్ తెలియజేశారు.

# సాంబాయిగూడెం పంచాయితీలో సిపిఐ ఘనవిజయం

**- 8 వార్డులకు ఆరు కైవసం**

**-సర్పంచ్‌గా చిడెం ఉషారాణి, ఉప సర్పంచ్‌గా పులిగెల రమేష్ యాదవ్**





**ప్రజాపక్షం/మణుగూరు:** మండల పరిధిలోని 14 పంచాయితీలలో సాబాయిగూడెం పంచాయితీని భారత కమ్యూనిస్టు పార్టీ ఘన విజయం సాధించింది. సర్పంచ్‌గా చిడెం ఉషారాణి సమీప బిఆర్ఎస్ అభ్యర్థిపై 140 ఓట్ల మెజారిటితో ఘన విజయం సాదించింది. పంచాయితీలోని ఎనిది వార్డులలో ఆరు వార్డులను మెజారిటితో గెలవగా, ఐదవ వార్డులు ఇద్దరకు సమానంగా 52 ఓట్లు రాగా డ్రాతీయగా బిఆర్ఎస్ అభ్యర్థికి లక్కి తగలటంతో ఒక వార్డును బిఆర్ఎస్ గెలుసుకుంది. సాంబాయిగూడెం పంచాయితీలో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్‌తో కలిసి 7వార్డులు సిపిఐ, ఒక వార్డు సిపిఐఎంఎల్ పోటి చేయగా సిపిఐ ఐదువార్డులు, సిపిఐఎంఎల్ ఒక వార్డును గెలుసుకుంది.ఉప సర్పంచ్ అవకాశం కూడ సిపిఐకి దక్కటంతో పులిగెల రమేష్ యాదవ్‌ను ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు.

# విజయా నర్సింగ్ హోమ్‌ను తనిఖీ చేసిన డిఎంఅండ్‌హెచ్‌ఓ



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆసుపత్రిలో రోగులకు అందించే సేవలకు సంభంధించి ప్రైస్‌లిస్ట్‌ను రిసెప్షన్ వద్ద స్పష్టంగా ఉంచాలని జిల్లా ఆరోగ్యశాఖ అదికారి తుకారాం రాథోడ్ అన్నారు. పాల్వంచ దమ్మపేట సెంటర్‌లో గల విజయా నర్సింగ్‌హోమ్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల పేర్లను స్పష్టంగా రాసి ఉంచాలన్నారు. ఉపయోగించే వైల్స్ మూత తొలగించిన వెంటనే వాటిపై ఉన్న తేదీ సమయం తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. కాన్పులు నిర్వహించే గదులు శుభ్రంగా ఉంచి, తగిన మందులను నిల్వ చేయాలన్నారు. ఆసుపత్రిలోనినెలకొన్న సమస్యలు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఎంఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మోతె పంచాయతీలో బిఆర్ఎస్ అభ్యర్థి విజయం

**విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ జెడ్‌పిటీసి**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గ్రామ పంచాయితీ ఎన్నికల్లో మోతె గ్రామ పంచాయితీ బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పోతునూరి సూరమ్మ ఘన విజయం సాధించారు. కాగ విజయోత్సవ వేడుకల్లో, తాళ్ళగొమ్మూరు గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గుమ్మడి కృష్ణవేణి విజయోత్సవ వేడుకల్లో మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత పాల్గొన్నారు. ఈసందర్భంగా విజయం సాధించిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పిల్లలు పాల్గొన్నారు.